క్లుప్తంగా

రామ మందిరం నాణేలు అందజేత



రామ మందిరం నాణేలను ఎమ్మెల్యే రాజాసింగ్‌కు అందజేస్తున్న రితీష్ జాగిర్దార్

సుల్తాన్‌బజార్: అయోధ్య రామ మందిరం నిర్మాణమవుతున్న శుభ సందర్భంలో లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీలు వీరేంద్ర అగర్వాల్, రితీష్ జాగిర్ధర్ ఆధ్వర్యంలో రామ మందిరం, సీతారాముల ప్రతిమతో కూడిన 11 వెండి నాణేలు తయారుచేసి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రిదేశ్ జాగిర్దార్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నాటికి అయోధ్య రామ మందిరం ప్రారంభం కానున్న నేపథ్యంలో రాముని ప్రతిమ రామ మందిరంతో కూడిన వెండి నాణేలను తాము తయారు చేయించినట్లు తెలిపారు. మోదీ ప్రధాని అయిన తర్వాత దేశంలో రామరాజ్యం వచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు.

కె.విశ్వనాథ్ మృతి తీరని లోటు



విశ్వనాథ్‌తో దామోదర్‌గుప్తా, ఆమని తదితరులు (ఫైల్)

గన్‌ఫౌండ్రీ: కళా తపస్వీ కె.విశ్వనాథ్ మృతిపై పలు కళా సంస్థల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి తీరని లోటు అని కన్నీంటి పర్వం అయ్యారు. రవీంద్రభారతిలో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఆయన హాజరై ఆశీర్వదించిన పలు సంఘటనలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తా, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, శృతిలయ ఆర్ట్స్ కార్యదర్శి ఆమనితో పాటు పలువురు ప్రతినిధులు ఆయనతో ఉన్న క్షణాలను గుర్తుచేసుకున్నారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫరాజ్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధి పనుల్లో జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోనే నెం.1 డివిజన్ బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ మహ్మద్ రాషెద ఫరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని గుల్షన్ కాలనీ, మినీ గుల్షన్ కాలనీలో పర్యటించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షేక్‌పేట్ డివిజన్‌కు కోట్లాది రూపాయల నిధులు సాధించి రోడ్లు, కొత్త డ్రైనేజీ వేయించామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి స్వయంగా తాను బస్తీలలో పర్యటించి అక్కడి సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు జహీర్, రహీమ్, ఖదీర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

అబిడ్స్: నూతన సచివాలయ నిర్మాణ భవనంలో మంటలు చెలరేగడంతో సందర్శించేందుకు వెళ్లిన గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు అరెస్టు చేశారు. గోషామహల్ నుంచి మెట్టు సాయికుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన అనుచరులతో కలిసి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందని ఆరోపించారు.

నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

గౌలిపురా: నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తి దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మొఘల్‌పురా పోలీసుల సహాయంతో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3 లక్షలు విలువ చేసే 18 అట్ట పెట్టెల నిషేధిత విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..మొఘల్‌పురాకు చెందిన తలాత్ ఇమామ్ (49) నిషేధిత విదేశీ సిగరెట్లను గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం మొఘల్‌పురా పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తలాత్ ఇమామ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3 లక్షలు విలువ చేసే 18 అట్టపెట్టెల నిషేధిత విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మొఘల్‌పురా పోలీసులకు అప్పగించారు. దీంతో మొఘల్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పాతబస్తీలో అధికారుల పర్యటన

చార్మినార్: పాతబస్తీలోని సర్దార్ మహల్ భవనంతో పాటు లాడ్‌బజార్ గాజుల దుకాణాల సముదాయాల సుందరీకరణ పనులను వెంటనే చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ ఆదేశించారు. కులీ కుతుబ్ షా నగరాభివృద్ధి శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సర్దార్ మహల్, లాడ్‌బజార్‌ను సందర్శించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. లాడ్ బజార్ సుందరీకరణలో భాగంగా ఇప్పటికే సిద్ధం చేసిన రెండు నమూనాలలో ఒక దానిని ఆయన ఫైనల్ చేశారు. అరవింద్‌కుమార్ ఫైనల్‌గా ఎంపిక నమూనా ప్రకారంగా సుందరీకరణ పనులను చేపట్టనున్నారు. ఇందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో 195 దుకాణాల సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. అలాగే శిథిలావస్థకు చేరుకున్న హెరిటేజ్ కట్టడమైన సర్దార్ మహల్ భవన సుందరీకరణ పనుల కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో సర్దార్ మహల్ భవన సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. పాతబస్తీలో పర్యటించిన అరవింద్‌కుమార్ సాధ్యమైనంత వెంటనే అభివృద్ధి పనులు చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కుడా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కుడా కార్యదర్శి గురువీర, ఈఈలు సురేశ్, శంకర్ రావులతో పాటు డీఈలు వెంకటేశ్వర్, మురళీ, సంధ్య తదితరులు ఉన్నారు.



లాడ్‌బజార్‌లో నమునాను పరిశీలిస్తున్న అరవింద్‌కుమార్, అధికారుల బృందం

పెండింగ్ బిల్లులను విడుదల చేయించండి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డులో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను విడుదల చేయించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య శాఖమంత్రి హరీష్‌రావుకు రాష్ట్ర కాంట్రాక్టర్స్ జేఏసీ ఏరియా సెల్ కన్వీనర్ పోల్కం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంత్రికి ఆయన వినతిపత్రం అందజేశారు. వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డున పడుతున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయనిచో వాటర్‌బోర్డు ఎండీ కార్యాలయం ఎదుట తాను ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని మంత్రికి శ్రీనివాస్ తెలిపారు. మంత్రి హరీష్‌రావు సానుకూలంగా స్పందించారు. పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించే విధంగా ఎండీ దానకిశోర్ చర్యలు తీసుకుంటారని మంత్రి వెల్లడించారు.

'అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తుతా'



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఒక ప్రజాప్రతినిధిగా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తుతానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరుతున్న ఆయనను పలువురు మజ్లిస్ నాయకులు కలిశారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఏ పార్టీ ఉన్నా మజ్లిస్ ప్రజల పక్షాన ఉండి వారి సమస్యలపై పోరాటం సాగిస్తుందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మంత్రులను ప్రశ్నించానన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నలు సంధిస్తానని ఆయన పేర్కొన్నారు. మజ్లిస్ నాయకులు జబ్బార్, అలీమొద్దీన్, మాజిద్ తదితరులున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నాంపల్లి: 11న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నాంపల్లిలోని క్రిమినల్ కోర్టు ఆవరణలో మొదటి అదనపు మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి కుశ, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్‌తో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌పై పార్టీలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీ కుదిర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాంపల్లి క్రిమినల్ కోర్టుకు కేవలం నేరాలకు సంబంధించిన కేసులే ఉన్నందున ఎక్కువగా కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల మీద దృష్టి సారించాలని సూచించారు. రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో సెటిల్ అయ్యేలా చూడాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

హరికథ ఎంతో మధురం



సత్యవతిని సన్మానిస్తున్న కొలకలూరి ఇనాంక్, కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: హరికథ గానం ఎంతో మధురమైనదని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి 71వ జన్మదినం సందర్భంగా హరికథ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ భాగవతాన్ని గరిమెళ్ల సత్యవతిచే ఆలపించిన విరాట పర్వం హరికథ ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, విశ్రాంత ఐఆర్ఎస్ పి.రఘు, పాత్రికేయులు జి.వల్లీశ్వర్, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.

బీఎస్పీ చార్మినార్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాంచరణ్ దాస్



చార్మినార్: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) చార్మినార్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మూల రాంచరణ్ దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీఎస్పీ నగర అధ్యక్షుడు చాట్ల చిరంజీవి సమక్షంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాతబస్తీకి చెందిన మూల రాంచరణ్ దాస్ ప్రస్తుతం వీకర్ సెక్షన్స్ అండ్ మైనార్టీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ నగర అధ్యక్షుడిగా, అంబేడ్కర్ సంఘం నగర అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఆయన రెండు దశాబ్దాలుగా బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమం కోసం, హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నారు. సంస్థ తరఫున మహిళలకు, యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'

గోల్కొండ: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ అన్నారు. బీఆర్ఎస్ అవినీతి పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని ఆయన అన్నారు. సీఎం కేసీఆర్ కేవలం ప్రగతి భవన్‌కే పరిమితమై పాలనను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆయన హయాంలో తెలంగాణ 20 ఏళ్లు వెనక్కి పోయిందని విమర్శించారు. ప్రధాని మోదీ ఈ సారి బడ్జెట్ భారతదేశపు అత్యుత్తమ బడ్జెట్, అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూర్చే విధంగా ఈ బడ్జెట్ రూపొందించబడిందని ఆయన అన్నారు.

'కంటి వెలుగు'కు విశేష స్పందన

గౌలిపురా: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని జంగమ్మెట్ క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని అన్నారు. ఉందాబజార్ యుపీహెచ్‌పీ ఆధ్వర్యంలో గౌలిపురా డివిజన్‌లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఈ కేంద్రానికి దాదాపు 100 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారని.. అవసరమైన కళ్ల అద్దాలను సైతం పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో 1310 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని.. 300 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉందాబజార్ వైద్యాధికారిణి డాక్టర్ వీణా, క్యాంపు వైద్యాధికారిణి డాక్టర్ శృతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోల్కొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీరంగూడకు చెందిన శైలేందర్ (24) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆయన బీరంగూడ నుంచి టోలిచౌకి వస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కూలీ పని ముగించుకుని శైలేందర్ టోలిచౌకి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలోనే మెహిదీపట్నం నుంచి దర్గా వైపు వెళ్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు వెనక నుంచి శైలేందర్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన శైలేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నూతన కార్యవర్గం ఎన్నిక

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వర్కల సత్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గం మూడేళ్ల పాటు పనిచేస్తుంది. కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యూనిట్ అధ్యక్షుడిగా భగవంతు, ఉపాధ్యక్షులుగా జగన్మోహన్, శివకుమార్, కార్యదర్శిగా కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా దుర్గయ్య, సత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి అజయ్‌కుమార్, కార్యాలయ కార్యదర్శి ఎండీ సలీం, కోశాధికారిగా రమేష్, కార్యవర్గ సభ్యులుగా జంగయ్య, ధన్‌రాజు సింగ్, మహ్మద్ మొయిజుద్దీన్, పర్వీన్ బేగం, సుజాత, జేపీ కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శి శంకర్‌లాల్ చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్, నేతలు అహ్మద్ పాష, మహేందర్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో శంకర్‌లాల్, చిత్రంలో సత్యనారాయణ

మహిళను దూషించిన కేసులో ఇద్దరికి జైలు

సంతోష్‌నగర్: ఓ మహిళను అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడిన కేసులో నిందితులకు నాంపల్లి 7వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. చంపాపేట్ మారుతినగర్‌కు చెందిన పురుడు రష్మీ ఇంటికి గత నెల 30న కల్మల ప్రవీణ్ కుమార్, సందీప్ తాగిన మైకంలో వచ్చారు. ప్రవీణ్, సందీప్ రష్మీతో పాటు ఆమె తల్లిని అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు రష్మి తల్లిపై దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితురాలు రష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రవీణ్, సందీప్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా నిందితులకు 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

లంగర్‌హౌస్: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు కింద పడి మృతి చెందాడు. అతను బస్సు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పగా పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండలో నివాసముండే నిజాముద్దీన్ అహ్మద్(50) రియల్‌స్టేట్ వ్యాపారి. వ్యాపారంలో నష్టాలు రావడంతో కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో లంగర్‌హౌస్ మిలటరీ ఆస్పత్రి వద్ద ఇంద్రారెడ్డి ఫ్లై ఓవర్ ప్రారంభం వద్ద రోడ్డు మధ్య డివైడర్‌పై కొద్దిసేపు వేచి ఉన్నాడు. అదే సమయంలో మెహిదీపట్నం నుంచి తాండూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కింద పడ్డాడు. తీవ్రగాయాలకు గురైన అతన్ని గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించి చెప్పారు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి అనంతరం మృతుడిని గుర్తించి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అయితే అతను ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడ్డాడా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నిజాముద్దీన్

సమగర జాతి ఆత్మ గౌరవ భవనాన్ని నిర్మించండి

అబిడ్స్: నగరంలో 50 వేల జనాభా ఉన్న సమగర జాతి సంఘ్ కులస్థులకు ఆత్మగౌరవ భవనాన్ని వెంటనే నిర్మించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. సమగర జాతి సంఘ్ నాయకులతో కలిసి మంత్రికి ఆత్మగౌరవ భవనంపై వివరాలు తెలిపారు. గతంలో మంత్రి గంగుల కమలాకర్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇంకా పనులు ప్రారంభం కాలేదని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. వెంటనే సమగర జాతి ఆత్మగౌరవ భవనం నిర్మించే విధంగా గంగుల కమలాకర్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్యలు ఉన్నా మంత్రి తలసాని సహకారంతో పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, మహేంద్రకుమార్, రాంచరణ్, భారత్‌భూషణ్, దుర్గారాజ్, లాలూ, ఆర్.శివచరణ్, విజయ్ పాల్గొన్నారు.



మంత్రి తలసానితో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

సిటీ కళాశాలలో గ్రూపు-2 ఉచిత శిక్షణ ప్రారంభం

చార్మినార్: రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన అభ్యర్థులలో ఎంపిక చేసిన 100 మందికి సిటీ కళాశాల సెంటర్‌లో ఉచితంగా శిక్షణ కల్పిస్తున్నామని డైరెక్టర్ అలోక్ కుమార్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో గ్రూపు-1 ప్రిలిమ్స్, కానిస్టేబుల్, ఎస్సై ఉచిత శిక్షణ అందజేస్తున్న బీసీ స్టడీ సర్కిల్ శుక్రవారం గ్రూపు-2 శిక్షణను కూడా ప్రారంభించిందన్నారు. ఈ సెంటర్ నుంచి గ్రూపు-1 మెయిన్స్‌కి ఎంపికైన అభ్యర్థులు ఉస్మానియాలో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులకి తమ కళాశాల అధ్యాపకుల సేవలు, గ్రంథాలయ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ తెలిపారు. స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ బాల కృష్ణ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిటీ కాలేజీ కెరీర్ గైడెన్స్ విభాగం కన్వీనర్ డాక్టర్ పద్మ అనురాధ, డాక్టర్ యాదయ్య, డాక్టర్ జె.నీరజా, డాక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ అలోక్ కుమార్

'ఎస్సీ, ఎస్టీలకు నిరాశాజనకంగా కేంద్ర బడ్జెట్'



మాట్లాడుతున్న యూనియన్ ప్రతినిధి నరసింహ

సుల్తాన్‌బజార్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ, ఎస్టీలకు నిరాశాజనకంగా ఉందని దళిత్ బహుజన్ శ్రామిక్ యూనియన్ (డీబీఎస్‌యూ) ఆరోపించింది. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీబీఎస్‌యూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి నరసింహ, రాష్ట్ర అధ్యక్షుడు ఆనందం, ఉపాధ్యక్షుడు మధుబాబు, కోశాధికారి నర్సింహులు మాట్లాడారు. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సమర్పించిన బడ్జెట్ కొన్ని ప్రజా కేంద్రీకృత సమస్యలను పరిష్కరించకపోగా ఎస్సీ, ఎస్టీలకు నిరాశజనకమైన కేంద్ర బడ్జెట్ అని వారు ఆరోపించారు. జాదవ్ కమిషన్ గైడ్ లైన్స్ ప్రకారం.. తక్కువ బడ్జెట్ కేటాయించారు. దళిత ఆదివాసులలో ఆర్థిక సమానతల పరిస్థితిని సరిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటాయించిన నిధులను దళిత, ఆదివాసి వర్గాల అభ్యున్నతి పారదర్శకంగా జవాబుదారిగా వినియోగించేలా చూడాలని కోరారు. కేటాయించిన నిధులు సరైన విధంగా ఖర్చు చేసే విధంగా ఆయా మంత్రిత్వశాఖలు చూడాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వల్లే కాకుండా ఎస్సీ, ఎస్టీలకు ప్రయోజనకరమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని వారు కోరారు. ఈ సమావేశంలో డీబీఎస్‌యూ ప్రతినిధులు మధుబాబు, శ్రీనివాస్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి సత్కారం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య బండి రామకృష్ణారెడ్డికి భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా శుక్రవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం పక్షాన నిర్వహించిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భండా ఆచార్య బండి రామకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ..ఆచార్య బండి రామకృష్ణారెడ్డికి పద్మశ్రీ పురస్కారం రావడం వల్ల గిరిజనులలో ఆత్మస్థైర్యం పెరిగిందని, వారి సంస్కృతి సంప్రదాయాలను భారత ప్రభుత్వం గుర్తించినట్లుగా భావిస్తున్నానని అన్నారు. ఆచార్య బండి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో గిరిజన భాష, జీవన విధానం ప్రత్యేక శైలితో కూడినదని, వారి సంస్కృతి నాగరికత సమాజంలో మానసిక ధృడత్వాన్ని పెంచుతుందని అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం అధిపతి ఆచార్య వై.రెడ్డి శ్యామల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి భాషా శాస్త్ర నిపుణులు డాక్టర్ ఉషాదేవి, డాక్టర్ ఆశీర్వదం, డాక్టర్ రామాంజనేయులు పాల్గొన్నారు.



ఆచార్య బండి రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఆచార్య తంగెడ కిషన్‌రావు

తీసుకున్న అప్పు ఇవ్వనందుకే పొడిచి చంపారు!

హత్య కేసులో నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న గోషామహల్ ఏసీపీ సతీష్ కుమార్, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

జియాగూడ: తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వనందుకు ఓ యువకుడిని హత్యచేసిన నిందితులను కుల్సుంపురా పోలీసులు రిమాండ్‌కు తరలించినట్లు గోషామహల్ ఏసీపీ ఆర్.సతీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అంబర్‌పేటకు చెందిన సాయినాథ్ (29) గ్లాస్ కట్టింగ్ వర్క్ పనులు నిర్వహిస్తున్నాడు. జియాగూడకు చెందిన ఆకాష్ మంచి స్నేహితులు. వీరితో పాటు జియాగూడకు చెందిన మురారి కార్‌సోను (26), ఎ.సాయికుమార్ యాదవ్ అలియాస్ టిల్లు (25) కూడా స్నేహితులే. గతేడాది ఆకాష్ వద్ద హతుడు సాయినాథ్ రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. డబ్బులు అడిగినప్పుడల్లా సాయినాథ్ దాటవేయడం, హేళన చేస్తూ మాట్లాడడం, దమ్ముంటే వసూలు చేసుకో అంటూ రెచ్చగొట్టేవాడు. ఇది మనసులో పెట్టుకున్న ఆకాష్ ఎలాగైనా సాయినాథ్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. సెల్‌ఫోన్‌లో సైతం హత్యలు ఎలా చేయాలో వీడియోలు డౌన్‌లోడ్ చేసుకుని చూసేవాడు. రెండు కత్తులను సైతం కొనుగోలు చేశాడు. తన స్నేహితులైన మురారికర్ సోను, ఎ.సాయికుమార్ యాదవ్‌ను కలుపుకొని హత్యచేస్తే పాపులర్ అవుతానని పథకం వేశాడు. గత నెల 22న ఆకాష్, సాయినాథ్‌కు ఫోన్‌చేసి మాట్లాడాలని 100 ఫీట్ల జాతీయ రహదారికి పిలిపించాడు. అక్కడికి రాగానే, ఆకాష్, సోను, సాయికుమార్ కత్తులతో దాడిచేసి పారిపోయారు. ఎట్టకేలకు శుక్రవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

జియాగూడ: అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12.5 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నగర టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్ డీసీపీ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ మేరకు షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడించారు. బర్కత్‌పురాకు చెందిన వికాస్ అగర్వాల్ గతంలో రేసు గుర్రాల బుకిగా కొనసాగేవాడు. ఆర్థిక లావాదేవీల కారణంగా తప్పుకుని సులభంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో గుజరాత్‌కు చెందిన ఇద్దరిని వెబ్ అప్లికేషన్ రాధే ఎక్స్ఛేంజ్ పేరుతో ఆన్‌లైన్ అప్లికేషన్ చేపట్టి ముంబైకి చెందిన సాగర్ అనే వ్యక్తితో కలిసి ఉంటూ ఇతర దేశాల నుంచి కొనసాగేలా ఐడీలు, పాస్‌వర్డ్‌లను పుంటర్స్‌కు కమీషన్ బేసిక్ మీద ఇచ్చాడు. అనంతరం గుజరాత్‌కు చెందిన గోషామహల్‌లో ఉండే మహేంద్ర పటేల్(36) వృత్తిరీత్యా వ్యాపారం, మరో పుంటర్ గుజరాత్‌కు చెందిన గోషామహల్ వాసి రాజేంద్ర పటేల్ కలిసి డబ్బులు కలెక్ట్ చేస్తూ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ను ఇతర పుంటర్స్ నుంచి కొనసాగిస్తున్నారు. ప్రధాన బుకి అయిన వికాస్ అగర్వాల్ గతంలో ఇదే విషయంలో అరెస్టు కూడా అయ్యాడు. బుధవారం విశ్వసనీయ సమాచారం మేరకు అహ్మదాబాద్‌లో ఇండియా వర్సెస్ న్యూజిల్యాండ్ ఆట బెట్టింగ్ కొనసాగుతుండగా టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్ టీమ్, షాహినాయత్‌గంజ్ పోలీసులు వీరిని పట్టుకుని నగదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం షాహినాయత్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో సౌత్‌జోన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్సైలు కె.నర్సిములు, ఎన్.శ్రీశైలం, వి.నరేందర్, షేక్ బుర్హాన్ తదితరులు ఉన్నారు.

